బీమాతో మహిళలకు ధీమా

- స్వశక్తి సంఘాల సభ్యులకు భరోసా
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మహిళా గ్రామైక్య సంఘాల సభ్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బీమా పథకం మహిళలకు ధీమాగా నిలుస్తోంది. స్వశక్తి సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ ఆర్థికంగా ఎదిగేలా సహకరిస్తోంది. కాగా నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పథకం మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థికంగా చేయూతను అందిస్తుంది. స్వశక్తి సంఘాల సభ్యులకు భరోసా కల్పించేలా చేపట్టిన బీమా పథకంపై జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


స్వశక్తి సంఘాల సభ్యుల సమావేశం (ఫైల్)

60ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికే..

స్వశక్తి సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే బీమా పథకం కోసం 60 సంవత్సరాల లోపు వయస్సున్న వారే అర్హులు. సంఘం సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షలు బాధిత కుటుంబానికి అందిస్తారు. ఒకవేళ సాధారణ మరణం చెందితే రూ.2లక్షలు చెల్లిస్తారు. గతంలో ఒక సంఘంలోని సభ్యుల్లో ఎవరైనా ఒకరు మృతిచెందినా, రుణం చెల్లించకున్నా మిగిలిన సభ్యులు మృతురాలి కుటుంబంపై రుణం చెల్లించాలని ఒత్తిడి చేసేవారు. ప్రస్తుతం ఆర్థిక సాయాన్ని ప్రమాదబీమా పథకం నుంచి చెల్లించే అవకాశం ఉంది. రుణం డబ్బులు బకాయి ఉంటే వాయిదా డబ్బులు పట్టుకుని మిగిలిన డబ్బులు మృతురాలి కుటుంబానికి అందిస్తారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పథకంపై స్వశక్తి సంఘాల మహిళా సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 11,229 ఎస్‌హెచ్‌జీలు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,229 స్వయం సహాయ సంఘాల్లో 1,27,485 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. మొత్తంగా 466 గ్రామైక్య సంఘాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల సభ్యులకు ఉచితంగా రెండు రకాల బీమా సౌకర్యం కల్పిస్తోంది. ప్రతీ సభ్యురాలికి సాధారణంగా అందించే లోన్ బీమాతో పాటు సురక్ష పథకంలో ప్రమాదబీమా సదుపాయం అందిస్తుంది. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుండగా ఈ ఏడాది మార్చి 14 నుంచి వచ్చే ఏడాది (2025) మార్చి 13 వరకు ఈ పథకం వర్తిస్తుంది. అనంతరం రెన్యువల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉంది.

మహిళలకు ఎంతో ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పథకం స్వశక్తి సంఘాల మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. బీమా ద్వారా వచ్చిన డబ్బులతో సభ్యులు బకాయిలు ఉన్న మొత్తం పట్టుకుని మిగిలిన డబ్బును సదరు కుటుంబానికి అందిస్తారు.బీమా పథకం మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు భరోసాగా నిలుస్తోంది.

- వరలక్ష్మి, డీపీఎం

బీమాతో భరోసా..



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పథకంలో మహిళా సంఘాల కుటుంబాలకు భరోసాగా ఉంటుంది. స్వశక్తి సంఘాల సభ్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పనిచేస్తూ నూతనంగా బీమా పథకం తీసుకురావడం హర్షణీయం.

- బేతి మంజుల, వీఓ అధ్యక్షురాలు, తాటికొండ

ప్రతీ ఏడాది రెన్యువల్ చేయాలి



స్వశక్తి సంఘాల సభ్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బీమా పథకం చేపట్టడం సర్వత్రా హర్షణీయం. అయితే ఈ పథకాన్ని ప్రతీ ఏడాది ప్రభుత్వం రెన్యువల్ చేయాలి. బీమా పథకంతో మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు ధీమా కలుగుతుంది.

- స్రవంతి, వీఓ అధ్యక్షురాలు, ఇప్పగూడెం

క్లుప్తంగా

మిత్రుల చేయూత



నర్మెట : తమతో కలిసి చదువుకున్న మిత్రుల కుటుంబ సభ్యులు అనారోగ్యంతో మృతి చెందడంతో 2004–05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గుగులోత్ రేణుక భర్త గుగులోత్ శ్రీను (38) మృతిచెందగా వారి కుటుంబానికి రూ.15వేలు, భూక్య శ్రీను(36) కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో తాటిరెడ్డి రామకృష్ణా రెడ్డి, గుండేటి రాంచందర్, కొంపెల్లి అంబేడ్కర్, కేలోత్ రమేష్, గొల్లపల్లి రాజు, భూక్య యాంజి, జడల రాజు, భూక్య మంగ, శవ్వ కృష్ణ, అరిగల రాజు, భూక్య తిరుపతి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



లింగాలఘణపురం : మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన నిమ్మకంటి రవికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో కాలు తొలగించారు. దీంతో ఉపాధి కోల్పోయిన అతనికి గ్రామానికి చెందిన వలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.56వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామంలో నాయీబ్రాహ్మణ వృతి చేసే రవి కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి విరాళాలు సేకరించి ఆదుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



దేవరుప్పుల : మండలంలోని కడవెండితో పాటు ఇతర వాగుల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఊర సృజనకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడవెండి రెవెన్యూ పరిధి పొట్టిగుట్ట తండాకు చెందిన గూడ వీరన్న, నరసింహ తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుక రవాణాకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై సృజనకుమార్ హెచ్చరించారు.

వాహనాల తనిఖీ



బచ్చన్నపేట : మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎస్‌కే హమీద్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, బైక్‌పై ముగ్గురు ప్రయాణం చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.

గుడుంబా తయారీదారుల అరెస్ట్

ఇద్దరిపై కేసు.. వాహనాలు స్వాధీనం



చిల్పూరు : నిషేధిత గుడుంబాను తయారు చేయడంతో పాటు విక్రయానికి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు వివరాలు వెల్లడించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అనిత ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఎర్రకుంటతండా పరిధిలో అక్రమంగా గుడుంబా తయారు చేయడంతో పాటు వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎర్రకుంటతండాకు చెందిన గుగులోత్ నెహ్రూ, వాంకుడోత్ తండాకు చెందిన వాంకుడోత్ హట్యా ద్విచక్ర వాహనంపై, ఆటోలో గుడుంబాను తరలిస్తు పట్టుబడ్డారు. వారినుంచి 8 లీటర్ల నాటుసారా, ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్,దస్తగిరి, సలీం, డ్రైవర్ శ్రీనివాస్ ఉన్నారు.

‘పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి’

- అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసిన సీపీఎం నాయకులు

జఫర్‌గఢ్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయడంతోపాటు హోం మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అమిత్ షా దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా తన పదవికి రాజీనామా చేయడంతో పాటు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. అంబేడ్కర్‌పై అవమానకరమైన విధంగా అమిత్ షా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు కాట సుధాకర్, ఎంపెల్లి అజయ్, రాజు, గబ్బెట కొమురయ్య, సాకి నర్సింగం, ఎర్ర రవి, శోభా, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సాగునీటి కాల్వ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి : పంటలకు సాగునీరు అందించే ప్రధాన కాల్వ మరమ్మతు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు మాట్లాడుతూ మండలంలోని బోయినిగూడెం నుంచి కంచనపల్లి మీదుగా నవాబుపేట రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వను శనివారం పరిశీలించి ఎమ్మెల్యేకు విన్నవించడం జరిగిందన్నారు. అందుకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించడంతో రైతుల పక్షాన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు జగదీశ్ చందర్‌రెడ్డి, లింగాజి, నరేందర్, రవీందర్, శ్రావణ్ కుమార్, లక్ష్మారెడ్డి, సోమాజి, వెంకన్న, అశోక్, అంజయ్య, పర్వీ, భాస్కర్, విజయమేరీ, పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారులకు అభినందన

బచ్చన్నపేట : సీఎం కప్–2024 క్రీడల్లో భాగంగా పలు విభాగాల్లో గెలుపొందిన దివ్యాంగ క్రీడాకారులను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం అభినందించారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం పారా స్పోర్ట్స్ నిర్వహించగా, బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన పి.అమరేశ్వర్, తమ్మడపల్లి గ్రామానికి చెందిన మట్టి కిషన్ దివ్యాంగుల వీల్ చైర్ క్రికెట్, వాలీబాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్స్ సాధించారు. వీరిని ఎమ్మెల్యే కడియం అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.


అభినందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఎమ్మెల్యేను కలిసిన సీపీఐ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి : ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సీపీఐ జిల్లా నాయకులు ఆదివారం హనుమకొండలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి ఆధ్వర్యంలో కడియంకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందించగా సానుకూలంగా స్పందించారని సీపీఐ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆది సాయన్న, పాతూరి సుగుణమ్మ, కావటి యాదగిరి, నాయకులు భువనగిరి కుమార్, యూనుస్, యాదగిరి, రాజు తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదును పెంచాలి


బచ్చన్నపేట: మాట్లాడుతున్న బీరప్ప


పాలకుర్తి టౌన్ : మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప

బచ్చన్నపేట : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును పెంచాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు సద్ది సోమిరెడ్డి, దొంతుల చంద్రమౌళి, కూరెళ్ల వెంకటరెడ్డి, జూకంటి గణేష్, గద్ద రాజు, శీలంకోటి రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పాలకుర్తి టౌన్ : బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా రిటర్నింగ్ ఇన్‌చార్జ్ డాక్టర్ వి.ప్రకాశరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోనొ ఓ గార్డెన్‌లో బూత్ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా సేవా దివస్ కార్యక్రమం చేపట్టాలన్నారు. జనగామ జిల్లాలో 250 బూత్ కమిటీలు వేసిట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కడుదుల నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

జనగామ రూరల్ : బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గానుగుపహాడ్ గ్రామంలో సంస్థాగత నిర్మాణంలో భాగంగా బూత్ నంబర్ 210 అధ్యక్షుడిగా కొడారి మహేందర్ 211 బూత్ అధ్యక్షుడిగా ఎడుమ రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు , కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సన్మానం


జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎంపీ

రఘునాథపల్లి : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మారుజోడు రాంబాబును ఆదివారం జిల్లా కేంద్రంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, వేమల సత్యనారాయణ, లోనె శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం


విహార యాత్రలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బచ్చన్నపేట : విహార యాత్రలు విజ్ఞానానికి దోహదపడతాయని మండలంలోని పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాటోత్ విజయ అన్నారు. ఆదివారం పాఠశాలలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీకి తీసుకెళ్లి పలు ప్రదేశాలను చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్కడ ఉన్న ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించామన్నారు. దశల వారిగా మరిన్ని చారిత్రక ప్రదేశాలను చూపిస్తామని విద్యార్థులు పాఠ్యపుస్తకాలలో చదివిన దాని కంటే చూసిన దానిని ఎక్కువగా గుర్తు పెట్టుకుంటారని తెలిపారు.

విద్యాభివృద్ధిలో గణితం కీలకం


రఘునాథపల్లి: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం రవీందర్ తదితరులు


స్టేషన్‌ఘన్‌పూర్: గణిత దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రఘునాథపల్లి : విద్యాభివృద్ధిలో ప్రతీఒక్కరికి గణితం ఎంతో కీలకమని మండలంలోని ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారత రవీందర్ అన్నారు. ఆదివారం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామానుజన్ గణిత ఆవిష్కరణలను, వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీలు, గణిత మేళా నిర్వహించారు. పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సరాబు శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పలు రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలతో పాటు పోటీ తత్వాన్ని అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పంచాక్షరీ, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య, మల్లేష్, సోమన్న, కళావతి, అరవింద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

స్టేషన్‌ఘన్‌పూర్ : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను మండలంలోని ఛాగల్లు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పరమేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత రంగోళి, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసం, గణిత చార్ట్స్ తయారీ తదితర పోటీలను నిర్వహించారు. గణిత ఉపాధ్యాయులు కొల్లూరు ప్రకాశం, విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులచే గణిత మాడల్స్ ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ గొప్పవారని, గణిత శాస్త్రంలో ఆయన చేసిన ఆవిష్కరణలు అద్భుతమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతి, లలితకుమారి, దేవేందర్‌కౌర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

దేవరుప్పుల : మండల కేంద్రంలోని శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన బబ్బూరి మహేష్ సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల కరస్పాండెంట్ పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు.

27లోపు అత్యవసర సేవలు నిర్వహించుకోండి

లింగాలఘణపురం : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్పు జరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులు ఈ నెల 27లోపు ఏమైనా అత్యవసర సేవలు ఉంటే నిర్వహించుకోవాలని బ్యాంకు మేనేజర్ సృజనాదేవి కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్పు చేయడంతో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోవడం జరుగుతుందని, నెట్ బ్యాంకింగ్, ఫోన్ పే, గుగూల్ పే వంటి సేవలతో పాటు ఇతర సేవలు పని చేయవని తెలిపారు.

వారంపాటు ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

దేవరుప్పుల : దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుతున్నందున వారంపాటు సేవలకు అంతరాయం కలుగుతుందని బ్యాంక్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


యాదయ్య (ఫైల్)

లింగాలఘణపురం : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టగల్ల యాదయ్య (65) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆయన సేవలను గుర్తు చేస్తూ సంతాపం వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు


మధుప్రియ

చిల్పూరు : చిన్నపెండ్యాలకు చెందిన పాశికంటి మధుప్రియ (15) అదృశ్యమైనట్లు ఆమె తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. బతుకుదెరువు కోసం రాజు తన భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. చదువు నిమిత్తం గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రులు వద్ద కూతురును వదిలేసి వెళ్లారు. కాగా మధుప్రియ ఇంటర్ చదువును మధ్యలోనే మానేసి ఇంటి వద్దనే ఉంటోంది. శనివారం రాత్రి ఎదురింటికి వెళ్లి వస్తానని చెప్పి ఎంతకు రాకపోవడంతో తల్లిదండ్రులు తెలిసిన వారి ఇళ్లలో వెతికినా జాడలేదు. అలాగే ఉదయం కూడా వెతికినా ఫలితం లేకపోవడంతో బాలిక తండ్రి రాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

మతిస్థిమితం లేని మహిళ..


పద్మ

పెద్దపల్లి జిల్లా హనుమంతుపేట గ్రామానికి చెందిన చలిగంటి పద్మ(40) మతిస్థిమితం లేకపోవడంతో కరుణాపురం చర్చికి ఆరురోజుల క్రితం వచ్చింది. శనివారం ప్రార్థనల అనంతరం బయటకు వెళ్లిన ఆమె కనిపించకుండా పోయింది. పద్మ భర్త రాజమల్లు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 87126 85209, 90599 41705కి సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

పాంనూర్‌లో కొండచిలువ ప్రత్యక్షం



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని పాంనూర్ శివారు కాశివారి ఇళ్ల సమీపంలో ఆదివారం సాయంత్రం కొండచిలువ ప్రత్యక్షమైంది. గమనించిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. అనంతరం కర్రలతో దానిని కొట్టి చంపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో కొండచిలువలు తరచుగా సంచరిస్తున్నాయని, తమకు భయంగా ఉందని వాపోతున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కొడకండ్ల : మండలంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. నర్సింగాపురం గ్రామానికి చెందిన పాపయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులతో పాటు ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న కప్పల రాజాలును దయాకర్‌రావు పరామర్శించారు. అలాగే ఏడునూతులకు చెందిన బొట్ల ఉప్పలమ్మ కుటుంబీకులను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగరాజును ఆయన పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, అభిమన్‌గాంధీ, వెంకటనారాయణ, సతీష్‌గౌడ్, వీరసోములు, శ్రీనివాస్, సోమన్న, సమ్మయ్య, లింగయ్య, హరీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నర్మెట : మండల కేంద్రానికి చెందిన కొలిపాక రాజఎల్లమ్మ (76), ప్రజ్ఞాపురం పోశమ్మ (60) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. కాగా డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి పార్టీ శ్రేణులతో కలసి ఆదివారం బాధిత కుటంబ సభ్యులను పరామర్శించి, నిత్యావసరాలు అందజేశారు. పార్టీ బాధ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య..

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు గట్ల మల్లారెడ్డికి ఇటీవల శస్త్రచికిత్స జరగగా అతడిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదివారం పరామర్శించారు.

కొమ్మూరి పరామర్శ



బచ్చన్నపేట : మండలంలోని పడమటికేశ్వపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆరుగొండ పర్వరాములు భార్య జ్యోతి ఇటీవల మృతి చెందగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. బాల్‌రెడ్డి, కామిడి జీవన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన న్యాలపోగుల రాజయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్, బీజేపీ నాయకుడు ఇల్లందుల సుదర్శన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నేలపోగుల రాజమౌళి, రఘునాథ్, నాగభూషణం, కుమారస్వామి, యాదగిరి, రమేష్, మోటం రాములు, నాగచంద్రు, మేరుగు కుమార స్వామి, సామల రాములు జంపయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



రఘునాథపల్లి : జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి (టీఆర్‌ఆర్ఎస్) రాష్ట్ర స్థాయి మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు మరికుక్కల యాదగిరి, యాకయ్య, ఉమేశ్, మహేశ్‌ల ఆధ్వర్యంలో మహాసభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రజకులంతా ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. మహాసభలకు రజకులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉల్లెంగుల రాములు, కొలిపాక రాములు, అనిల్, నర్సింహులు, హరీష్, రాజు, లక్ష్మణ్, ఉద్విత్, మియన్స్, నరేష్, సంతోష్, అయోధ్య, ప్రశాంత్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.